క్లుప్తంగా

సాయి మందిరంలో దీపాలంకరణ



సాయి బాబా మందిరంలో దీపాలు వెలిగించిన భక్తులు

బుట్టాయగూడెం: కార్తీకమాసం చివరి గురువారం కొమ్ముగూడెం సెంటర్‌లో ఉన్న సాయి మందిరంలో భక్తులు దీపాలంకరణ చేశారు. మందిరంలో దీపాలు వెలిగించి సాయి పల్లకిని మోస్తూ సాయిరాం కీర్తనలు పాడారు. కార్యక్రమంలో సాయి సేవక్స్ పి.పోతురాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి అభిషేక పూజలు



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కుక్కునూరు: కార్తీకమాసం బహుళ త్రయోదశి పురస్కరించుకుని గురువారం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. నందీశ్వరుడికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



కొయ్యలగూడెం పీహెచ్‌సీలో వైద్యాధికారులతో చర్చిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరి

కొయ్యలగూడెం: స్థానిక పీహెచ్‌సీని వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో రోగులకు అందుతున్న చికిత్స, సదుపాయాల గురించి అధికారులను అడిగడంతో పాటు పేషెంట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఖాళీ పోస్టు భర్తీ కోసం వైద్యాధికారులు వివరించారు. డాక్టర్ ఎస్తేరు రాణి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


విత్తనాభివృద్ధి క్షేత్రం పరిశీలన



విత్తనాభివృద్ధి క్షేత్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

టి.నరసాపురం: విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని అల్లంచర్ల రాజుపాలెంలోని విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం విత్తనాభివృద్ధి క్షేత్రానికి కేటాయించిన భూమికి నాలుగు వైపులా హద్దులు నిర్ణయించాలని మండల సర్వేయర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏవో బి.సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

కోత కూలీలను బెంబేలెత్తించిన కొండచిలువ



గ్రామస్తులు హతమార్చిన కొండచిలువ

కుక్కునూరు: వరి పంటను కోస్తుండగా కొండచిలువ తారసపడటంతో రైతులు కొండచిలువను కొట్టి చంపిన ఘటన గురువారం మండలంలోని కమ్మరిగూడెం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని కమ్మరిగూడెం గ్రామంలో ఓ పంట చేలో వరి కోతలు జరుగుతున్న సమయంలో పంట చేలో 12 అడుగుల కొండచిలువ రైతులకు తారస పడింది. దీంతో ఆందోళనకు గురైన వారు గ్రామస్తులకు సమాచారం అందించడంతో ఆ చుట్టుపక్కల నుంచి వచ్చిన యువకులు కొండచిలువను కర్రలతో కొట్టి చంపి వేశారు. దీంతో పంట చేలో పని చేస్తున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంట గ్రామ శివారులో బుధవారం ఒక పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,160 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

అప్రమత్తతతో గానోడెర్మా నివారణ

- ఆయిల్‌పామ్‌లో చాపకింద నీరులా వ్యాపిస్తున్న తెగులు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు



యాజమాన్య పద్ధతులపై శిక్షణనిస్తున్న ఉద్యానశాఖ అధికారులు



ఆయిల్‌పామ్ తోట

టి.నరసాపురం: ఆయిల్‌పామ్‌లో గానోడెర్మా తెగులు కనిపిస్తోంది. రైతులు జాగ్రత్తలు పాటిస్తూ పంటను రక్షించుకోవాలి. దీని కోసం సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. టి.నరసాపురం మండలం సీతంపేటలో ఆయిల్‌పామ్ రైతులు అధికంగా ఉన్నారు. వీరికి యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖ అధికారులు ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ గానోడెర్మా తెగులు చాపకింద నీరులా వ్యాపిస్తోంది. జాగ్రత్తలు పాటించకపోతే రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. తెగులు లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ఈ తెగులు చెట్లు చుట్టూరా ఉన్న ముదురు ఆకులు పసుపు, నారింజ రంగులోకి మారి, విరిగి వేలాడుతాయి. వేర్లు నల్లబడిపోవడం, కాండం లోపల కుళ్లిపోవడం వంటివి జరుగుతాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కాండం మొదలు వద్ద పుట్ట గొడుగులు కనిపిస్తాయి.

నివారణ చర్యలు ఇలా

ఈ తెగులు నివారణకు మొక్కల మొదళ్లలో పుట్టగొడుగులు ఉంటే వాటిని తొలగించి, ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల హెక్సాకొనాజోల్ పిచికారీ చేయాలి. అలాగే వ్యాధి సోకిన మొక్కలతో పాటు పక్కనే ఉన్న మొక్కల చుట్టూ పళ్లాలను తీసి, ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్ టెబుకోనజోల్ (నేటివో) 2.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి, హెక్సాకొనజోల్ (కాంటాఫ్) 5 ఈసీ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి, ప్రోపికోనజోల్ (టిల్ట్) రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున ముప్పై లీటర్ల మిశ్రమాన్ని తయారు చేసుకుని ఏడాదికి మూడు సార్లు తడిచేటట్లు పోసుకోవాలి. తెగులు సోకిన తరువాత మొక్క వేర్లు దెబ్బతింటాయి. కావున కొత్త వేర్ల కోసం ఆర్బస్కులర్ మైకోరిజా (ఏఎం)ను మొదళ్లలో వేసుకోవడం ద్వారా నీరు, పోషకాలు చెట్టుకు అంది చనిపోకుండా ఉంటాయి. అలాగే వ్యాధి సోకి చనిపోయిన మొక్కల మొదళ్లు తొలగించి కాల్చి వేయాలి. మొక్కలు తీసిన ప్రాంతంలో 40 శాతం ఫార్మల్డిహైడ్ ద్రావణాన్ని చల్లి, ఏడు నుంచి పది రోజులు ప్లాస్టిక్ షీట్ కప్పి ఉంచాలి.

తెగులుపై అప్రమత్తంగా ఉండాలి



గానో డెర్మా తెగులుపై ఆయిల్‌పామ్ రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ తెగులు సోకిన ఆయిల్‌పామ్ తోట ల్లో దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. దీనిపై రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి. మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగులు నివారించుకోవచ్చు.

జి.లక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి

ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో

ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో సాగు చేపట్టడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. కోకోలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులు తెలుసుకోవాలి. ఈ విధానంలో సాగుకు బిందు సేద్యం వలన మేలు జరుగుతుంది. సేంద్రియ పద్ధతుల్లో తెగుళ్లు, పురుగుల నివారణ చేసుకుంటే రైతులకు ఖర్చులు ఆదా అయ్యి, లాభసాటిగా ఉంటుంది.

దేముడు బాబు, కోకో కంపెనీ ఫీల్డ్ అధికారి

ఆత్మీయ కలయిక



జగనన్నతో బుసనబోయిన వంశీ

ద్వారకాతిరుమల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దివంగత మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బుసనబోయిన సత్యనారాయణ కుమారుడు వంశీ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

జంగారెడ్డిగూడెం: సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంటన్నర వరకు జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూలే ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలి



చింతలపూడి: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కొయ్యలగూడెం: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

చింతలపూడి: పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జోతిరావు పూలే వర్ధంతిని పలు బీసీ సంఘాలు, దళిత సంఘాలు, మానవత స్వచ్ఛంద సేవా సంఘం, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో

స్థానిక వైఎస్ఆర్ సిపి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీరావ్‌పూలే వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పూలే విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, వైసీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజయరాజు మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం పూలే పాటు పడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, సర్పంచ్ శివరామకృష్ణ, వైసీపీ నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎం రాంబాబు, ఎ సుబ్బారావు, కె ఏలియ, రామరాజు నాయక్, గోలి చంద్రశేఖర్‌రెడ్డి,ఎం దిలీప్ కుమార్, ఎన్‌దుర్గారావు, బి గోపి, డోకల రాము, పి మాధవరెడ్డి, గోపిరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్రావు, డాక్టర్ సయ్యద్ మీర్‌హాసిం, తదితరులు పాల్గొన్నారు.

ఏ తరానికైనా పూలే ఆదర్శనీయుడు

కొయ్యలగూడెం: ఏతరం వారికైనా మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. అశోక్ నగర్‌లో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి నిర్వహించారు. అసమానతలను రూపుమాపడానికి తన జీవితాన్ని అంకితం చేసిన పూలే తన భార్య సావిత్రి బాపూలే ద్వారా కూడా మహిళల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించారన్నారు. ఆంజనేయరాజు, జమ్మి శ్రీనివాస్, రాజేంద్ర, వాసు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సభ్యులకు అండగా నిలబడతాం



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: సోషల్ మీడియా సభ్యులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలబడుతుందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. యర్రంపేట గ్రామంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు కలిసి పాల్గొన్నారు. వాక్ స్వాతంత్రాన్ని అణగదొక్కాలనే యోచనతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలు హింసాత్మకంగా మారాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోషల్ మీడియా సభ్యులకు, క్రియాశీలక కార్యకర్తలకు భరోసా కల్పించాలని పిలుపునిచ్చారని ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షురాలు విగ్గిన వెంకటలక్ష్మి నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కంటమణి సుబ్బారాయుడిని, విగ్గిన రామకృష్ణలను పరామర్శించారు. కంభంపాటి బుజ్జిబాబు, ఉసే బాబురావు, మండపాటి రామకృష్ణ, చిక్కాల దుర్గాప్రసాద్, నారా రామకృష్ణ, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



రోడ్డుపైకి చేరుతున్న వాడకం నీటిని పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: ప్రతీ ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పోలవరం పంచాయతీ పరిధిలోని రామయ్యపేట పునరావాస కేంద్రంలో ఇళ్లల్లోని వాడకం నీరు రోడ్లపైకి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మామిడిగొంది గ్రామంలో కూడా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఇంకుడు గుంటల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధరరావు, ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంక్షేమ కార్యదర్శి కమలకుమారి

ద్వారకాతిరుమల: విద్యార్థి దశ దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దొరసానిపాడు మహిళా సంక్షేమ కార్యదర్శి టి.కమలకుమారి సూచించారు. స్థానిక న్యూ కీర్తి పబ్లిక్ స్కూల్‌లో గురువారం మాండలెజ్ కంపెనీ, ఆఫ్రో సంస్థ, అలాగే మహిళా పోలీసు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు వ్యవస్థపై పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమ కార్యదర్శి కమలకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మాటలు వింటూ, విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. అనంతరం అభయ యాప్ ఉపయోగాలను మహిళలకు తెలియజేశారు. ఆఫ్రో సంస్థ ఎగ్జిక్యూటివ్ రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్, ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేలేరుపాడు: జంగారెడ్డిగూడెం విద్యుత్ లైన్ పరిధిలోని సబ్‌స్టేషన్లలో ఈ నెల 29వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరెడ్డిగూడెం, లక్కవరం, బయ్యనగూడెం, మైసన్నగూడెం, దర్భగూడెం, బుట్టాయగూడెం, సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.దీని వల్ల వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, లక్కవరం, కొయ్యలగూడెం, మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన వీరంకి పద్మావతి అనే మహిళను అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా చింతలపూడి మండలం, ఫాతిమాపురం గ్రామంలో నాటు సారా నిర్వాహకులపై దాడులు చేసి మొర్ల చార్లెస్ అను వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ అధికారులు గురువారం మండలంలో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఒక మహిళను అరెస్టు చేసి, 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాట నాయకుడు మోషేన్‌రాజు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కామవరపుకోట: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటే నాయకుడు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అని పలువురు వక్తలు అన్నారు. గురువారం శాసనమండలి చైర్మన్ కోయ్యే మోషేన్‌రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తూరు బస్టాండ్ ఎదురుగా గల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఎదురుగా కామవరపుకోట మండలం వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసే ఆనంద్, ఎస్‌కే కరిముల్లా, బట్ట సుబ్బారావు, చింతపల్లి సుధా, మాంద్రు లాజరు, మేడంకి దావీదు, యానాద్రి పీటర్, టోకూరి మురళి, సరస్వతి సత్యనారాయణ, చాపల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి ఫర్నిచర్ అందజేత



ఏరియా ఆసుపత్రికి ఫర్నీచర్ అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం ఉంటే ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ బేబీ కమల అన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం త్రీ సీటర్ కుర్చీలు–6, బెడ్ షీట్లు–300 అందజేశారు.

యజ్ఞవల్క పీఠంలో అన్న సమారాధన



అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: యజ్ఞవల్క పీఠంలో (శ్రీకాన్వ విద్యాపీఠం) గురువారం కార్తీకమాస అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహశర్మ ఆధ్వర్యంలో శిష్యగణం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దామోదర పూజ, కార్తీకమాస ప్రాసస్యం, శాకాహార భోజనం గురించి భక్తులకు పండితులు అనుగ్రహభాషణ చేశారు. ప్రతి సంవత్సరం పీఠంలో అన్ని సామాజిక వర్గాల వారికి అన్న సమారాధన నిర్వహిస్తున్నందుకు పలువురు ప్రజా ప్రతినిధులు నరసింహశర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ వైర్లను సరిచేయాలని వినతి



విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

టి.నరసాపురం: కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా తయారైన విద్యుత్ వైర్లను వెంటనే సరి చేయాలని పుట్రేపు గ్రామ యువత కోరింది. ఈ మేరకు గురువారం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి వచ్చే రోడ్డు మార్గంతో పాటు, గ్రామంలో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయని, దీంతో విద్యుత్ వైర్లు చేతి కందే ఎత్తులో వేలాడుతున్నాయన్నారు. వైర్లు కిందకు వేలాడుతూ ఉండడం వల్ల భారీ వాహనాలు వెళ్లినపుడు ఏం ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాణాల నాగేంద్ర, కట్టూరి నాగరాజు, గుర్రం రాము, కాటిక ఏలియా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: మండలంలో పేద వర్గాల ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మైసాక్షి వెంకటాచారి, కూరాకుల బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు బెస్తగూడెం సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూమిలేని ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో రెండు సెంట్లు పట్టణాల్లో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, మహేష్, కంటిపల్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: డిసెంబర్ పదో తేదీన సీపీఎస్ రద్దు కోరుతూ ఛలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం వివిధ సంఘ నాయకుల చేతుల మీదుగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఐవీ రత్నం మాట్లాడుతూ ఉద్యోగులకు పింఛన్ హక్కు అని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా

లింగపాలెం: ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మాజీగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హబీబ్‌భాషా మాట్లాడుతూ పీఏసీఎస్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ధాన్యం కొనుగోళ్లు వేగంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో చింతలపూడి ఏడీఏ బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి: తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో మూడు లక్షల యాభై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు లక్షా ఇరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. చింతలపూడి సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు తెలిపారు.